సాక్షి తిరుపతి

శనివారం ၊ 24 ၊ మే ၊ 2025



ఐపీఎల్ తరహాలో సీపీఎల్

ఐపీఎల్ తరహాలో సీపీఎల్ నిర్వహించడం అభినందనీయమని తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. - 10లో



టీడీపీ విస్మరిస్తోంది

టీడీపీ విజయం కోసం శ్రమించిన వారిని పార్టీ అధిష్టానం విస్మరిస్తోందని ఏఎంసీ చైర్మన్ ఇళంగోవన్ ఆరోపించారు. - 10లో



యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లాలోని 13 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించనున్న యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. - 10లో

న్యూస్‌రీల్

తిరుచ్చిపై సిరులతల్లి విహారం



ఊరేగుతున్న అమ్మవారు

చంద్రగిరి: తిరుచానూరు పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి శ్రీకృష్ణ ముఖమండపం వద్ద స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అలంకార మండపంలో విద్యుత్‌కాంతుల నడుమ ఊంజల్ సేవ చేశారు. సర్వాలంకార భూషితురాలైన పద్మావతి అమ్మవారు బంగారు తిరుచ్చి వాహనంపై కొలువుదీరి నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కు రూ.17 లక్షల విరాళం



అదనపు ఈఓ వెంకయ్య చౌదరికి డీడీ అందిస్తున్న దాత

తిరుమల : శ్రీవారి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు హైదరాబాద్ కు చెందిన పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఎండీ సత్య రోహిత్ రూ.17 లక్షల విరాళం శుక్రవారం అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరికి డీ డీని అందజేశారు. ఈ నగదును మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో భక్తులకు ఒక పూట మధ్యాహ్నం భోజనం వడ్డించేందుకు వినియోగించాలని దాత కోరారు.

28న ఎస్వీయూ క్యాంటీన్‌కు టెండర్ నోటిఫికేషన్

తిరుపతి సిటీ : ఎస్వీయూ క్యాంటీన్‌కు ఈనెల 28వ తేదీన టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలని క్యాంటిన్ కమిటీ నిర్ణయించింది. శుక్రవారం ఈ మేరకు వీసీ ఆధ్వర్యంలో సమావేశమైన క్యాంటిన్ కమిటీ గతంలో ఇచ్చిన టెండర్‌ను రద్దు చేసింది. ప్రస్తుతం క్యాంటీన్‌ను నిర్వహిస్తున్న జయచంద్ర నాయుడు అత్యల్పంగా టెండర్ కోట్ చేయడంతో ఆయనను వచ్చే టెండర్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలు లేకుండా అనర్హుడిగా ప్రకటించింది. క్యాంటిన్ నిర్వహణపై ఆసక్తిగలవారు 28 నుంచి 15 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

31 నుంచి పోస్టల్ ఖాతాలకు ప్రత్యేక శిబిరాలు



నరసప్ప, పోస్టల్ సూపరింటెండెంట్

తిరుపతి సిటీ : పోస్టాఫీసులో సేవింగ్ ఖాతాలు తెరుచుకునేందుకు ఈ నెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ బి.నరసప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాల్లో పోస్ట్ సేవింగ్ ఖాతాలను తెరవడం, ఇప్పటికే ఉన్న ఖాతాలకు ఆధార్ లింక్ చేయడం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపింగ్ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో నిరుపయోగంగా ఉన్న 11,599 ఖాతాలను 465 పోస్టాఫీసుల ద్వారా పునరుద్ధరణ చేయనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను అర్హులైన లబ్దిదారులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ చేసేందుకు వీలుగా ఈ ఖాతాలు ఉపయోగపడతాయని చెప్పారు. సాధారణ రోజులలో సైతం పోస్టాఫీసులో సేవింగ్స్ ఖాతాలు తెరుచుకోవచ్చని తెలిపారు. 18ఏళ్లు నిండిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్వీయూలో ఫారెస్ట్ అధికారుల తనిఖీ

తిరుపతి సిటీ: ఎస్వీయూలో రోడ్డు పక్కన ఉన్న శ్రీగంధం వృక్షం ఇటీవల అపహరణకు గురికావడం సంచలనం రేపింది. ఈ నేపథ్యంలో ఫారెస్ట్ అధికారులు ఈ విషయాన్ని సుమోటాగా తీసుకుని శుక్రవారం వర్సిటీలోని శ్రీవారి ఆలయం ఎదుట దుండగులు నరికివేసి అపహరించిన శ్రీగంధం మొదలును పరిశీలించారు. అలాగే వర్సిటీలో శ్రీగంధం, ఎర్రచందనం చెట్ల వివరాలను సేకరించారు. అపహరణకు గురైన మొక్కల వివరాల నివేదికను సంబంధిత ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ తనిఖీలో వర్సిటీలో సుమారు పది రకాల చెట్లు మాయమైనట్లు వర్సిటీలో చర్చ సాగుతోంది.

దేదీప్యం



ఆధ్యాత్మిక క్షేత్రం శుక్రవారం సాయం సంధ్యా సమయంలో అద్భుత వెలుగులు విరజిమ్మింది. నీలి వర్ణ శోభితమై అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. విద్యుద్దీపాల వెలుగులో తిరుపతి నగరం దేదీప్యంగా విరాజిల్లింది. తిరుమల నుంచి వస్తున్న శ్రీవారి భక్తుల మనసు మురిసేలా సుమనోహరంగా సాక్షాత్కరించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

బేఖాతర్!



ట్రాఫిక్ నిబంధనలను ద్విచక్ర వాహనదారులు యథేచ్ఛగా అతిక్రమిస్తున్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన నో పార్కింగ్ బోర్డు పక్కనే బైక్‌లను పార్క్ చేస్తున్నారు. రూ.2వేల జరిమానా విధిస్తామన్న హెచ్చరికలను సైతం బేఖాతర్ చేసేస్తున్నారు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో రేణిగుంటలోని అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా దుకాణాల వద్ద ఇష్టారాజ్యంగా వాహనాలను పార్క్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - రేణిగుంట

దారుణమయా!

తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో రోగులు దాహంతో అలమటిస్తున్నారు. వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం కారణంగా నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా వేసవి నేపథ్యంలో దప్పిక తీర్చుకునే దారి కోసం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయలసీమలోనే పెద్దాస్పత్రిగా పేరుపొందిన రుయాలో కేవలం రెండు వార్డులకు మాత్రమే ఆర్‌ఓ ప్లాంట్లను అందుబాటులో ఉంచడంపై రోగుల సహాయకులు మండిపడుతున్నారు. దీనికి తోడు ఆయా ప్లాంట్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





ఆర్‌ఓ ప్లాంట్ వద్ద నీటిని బాటిల్‌లో తీసుకెళుతున్న రోగి సహాయకురాలు

- పెద్దాస్పత్రిలో తాగునీటి కటకట
- కేవలం రెండు వార్డులకే అందుబాటులో ఆర్‌ఓ ప్లాంట్లు
- 15 విభాగాలలోని రోగులకు తప్పని అవస్థలు
- రాత్రివేళ పరిస్థితి మరింత దయనీయం
- అపరిశుభ్రంగా ప్లాంట్ల పరిసరాలు

తిరుపతి తుడా : రాయలసీమకే తలమానికంగా తిరుపతిలోని రుయా ఆస్పత్రిని పిలుస్తుంటారు. నిత్యం వేలాదిమంది పేదలు చికిత్స కోసం తరలివస్తుంటారు. అయితే ఆ స్థాయిలో వసతులు కల్పించడంలో మాత్రం ఆస్పత్రి అధికారులు విఫలమయ్యారు. ముఖ్యంగా రోగులు, సహాయకుల అవసరాలకు తగ్గట్టు తాగునీటి సౌకర్యం కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారు. అంత పెద్ద ఆస్పత్రిలో కేవలం ఒకటి, రెండు వార్డులకు మాత్రమే నీటి వసతి ఉంది. మిగిలిన వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులకు దాహం తీర్చుకునేందుకు తిప్పలు తప్పడం లేదు. రుయాలోని పోలీస్ అవుట్‌పోస్ట్ ఎదుట, ఓపీ విభాగం ఎదుట ఉన్న ఆర్‌ఓ ప్లాంట్‌లే అందరికీ దిక్కుగా మారాయి. ఆస్పత్రిలోని సుమారు 15 వార్డులకు అందుబాటులో ఎలాంటి నీటి సౌకర్యం లేదు. దీంతో దూరంలోని పలు విభాగాల నుంచి సహాయకులు నడుచుకుంటూ వచ్చి బాటిళ్లతో ఆర్ ప్లాంట్ వద్ద తాగునీరు పట్టుకెళ్లాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. కటిక చీకట్లోనే కాళ్లీడ్చుకుంటూ ఆర్‌ఓ ప్లాంట్ల వద్దకు రావాల్సి వస్తోంది.

స్పందించని యంత్రాంగం

రుయా ఆస్పత్రిలో తాగునీటి కటకటపై పలువురు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు కనీసం స్పందించడం లేదు. వృద్ధులు, మహిళలు సుదూరం వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేసవి నేపథ్యంలో తాగునీటి అవసరాలు ఎక్కువగా ఉంటాయని తెలిసినా అధికారులు తగు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం స్పందించి ప్రతి వార్డుకు అందుబాటులో తాగునీటి వసతి కల్పించాలని రోగులు, సహాయకులు కోరుతున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



ఆర్‌ఓ ప్లాంట్ల వద్ద మురుగు

రుయా ఆస్పత్రిలో ఉన్నవే రెండు ఆర్‌ఓ ప్లాంట్లు. వాటి పరిసరాలను చూస్తే దాహం తీర్చుకోవాలనే ఆలోచనే విరమించుకోవాల్సి వస్తోంది. ఆ ప్లాంట్ల వద్ద పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. అసలు ప్లాంట్లను శుభ్రం చేస్తారో.. లేదో తెలియదు కానీ, అక్కడి వాతావరణం చూస్తే మాత్రం దారుణంగా ఉంటుంది. కొన్ని కొళాయిలు విరిగిపోయాయి. మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి. నీరు పట్టుకునే ప్రాంతంలో పాచిపట్టి దుర్వాసన వెదజల్లుతోంది. ప్లాంట్ చుట్టుపక్కల చెత్తాచెదారం పేరుకుపోయింది. పేరుకేమో పరిశుద్ధ జలం.. పరిసరాలు మాత్రం అధ్వాన్నంగా తయారయ్యాయి. అలాంటి నీటిని తాగితే రోగాలను నయం చేసుకునేందుకు వచ్చిన వారు సైతం సరికొత్త వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. దీంతో పలువురు బయట నుంచి వాటర్ బ్యాటిళ్లను కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు.

పేదల సేవకే ప్రాధాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : పేదల సేవకే ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. రుయా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్, ఎక్విప్‌మెంట్‌పై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధునాతన వస్తువులు, పరికరాలను తీసుకురావడంతో బాధ్యత తీరిపోయినట్లు కాదని, వాటిని పేదల కోసం సక్రమంగా వినియోగించినప్పుడే విజయవంతమైనట్లు భావించాలని సూచించారు. రుయా ఆస్పత్రికి ఇంకా కావాల్సిన ఎక్విప్‌మెంట్ కోసం ప్రతిపాదనలు పంపాలని కోరారు. సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో అవసరమైన సిబ్బందిని వెంటనే నియమించాలని ఆదేశించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి నిత్యం వచ్చే రోగులకు అవసరం అయిన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. సమావేశంలో రుయా సూపరింటెండెంట్ రాధ, డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్, ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ రవి ప్రభు పాల్గొన్నారు.

యోగాంధ్ర నిర్వహణకు పటిష్ట చర్యలు

తిరుపతి అర్బన్: యోగాంధ్ర నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి వర్చువల్ పద్ధతిలో అధికారులతో సమీక్షించారు.ఆయన మాట్లాడుతూ ఒకే భూమి.. ఒకే ఆరోగ్యం కోసం యోగా అనే థీమ్ స్ఫూర్తితో జూన్ 21 వరకు యోగ మాసంగా పరిగణించాలన్నారు. ఆ మేరకు నియోజకవర్గాల వారీగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు.

తిరుమలలో టీటీడీ ఈఓ తనిఖీలు





సూచనలిస్తున్న టీటీడీ ఈఓ శ్యామల రావు, క్యూను పరిశీలిస్తున్న అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల : తిరుమలలోని పలు ప్రాంతాలను టీటీడీ ఈఓ శ్యామలారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిలా తోరణం, చక్ర తీర్థంలో చక్రత్తాళ్వార్, నరసింహస్వామి, ఆంజనేయస్వామి ప్రతిమలతో పాటు ఆయా ప్రాంతాల్లో పరిశుభ్రత, పార్కింగ్‌ను పరిశీలించారు. పరిశుభ్రతను మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆరోగ్య శాఖ డిప్యూటీ ఈఓ సోమన్ నారాయణ, ఆరోగ్య అధికారి డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

అదనపు ఈఓ పరిశీలన

తిరుమలలో భక్తుల రద్దీ పెరగడంతో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి శుక్రవారం వేకువజామున క్యూలను తనిఖీ చేశారు. కృష్ణతేజ విశ్రాంతి భవనం వద్ద శ్రీవారి సేవకులు పంపిణీ చేస్తున్న అన్న ప్రసాదం. పాలు, తాగునీరు, టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలపై భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ ఈఓ (హెల్త్) సోమన్ నారాయణ పాల్గొన్నారు.

రుయాలో కోవిడ్ వార్డు





తిరుపతి తుడా : కరోన మహమ్మారి మరోసారి విస్తరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. పొరుగు దేశాల్లో కోవిడ్ తీవ్రత అధికంగా ఉండడంతో సర్కారు మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రభుత్వాస్పత్రుల్లో కోవిడ్ వార్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో కోవిడ్ ఐసోలేషన్ ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్ణయించారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ శుక్రవారం విభాగాధిపతులతో సమావేశమయ్యారు. కోవిడ్ నిర్ధారణ పరీక్షలకు రాపిడ్ కిట్లు కొనుగోలు చేయాలని అలానే ఐసోలేషన్ వార్డుకు డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది కేటాయింపులపై ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేకంగా 20 పడకలు

కోవిడ్ మార్గదర్శకాలకు అనుగుణంగా రుయా ఆస్పత్రిలో 20 బెడ్లతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. 20 పడకలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అలాగే కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు తగు జాగ్రత్తలతో కూడిన కౌంటర్ సిద్ధం చేస్తున్నారు. శనివారం నుంచి కోవిడ్ నిర్ధారణ పరీక్షలకు అవసరమైన ర్యాపిడ్ కిట్లు అందుబాటులో ఉంటాయని రుయా సూపరింటెండెంట్ రాధ తెలిపారు. జ్వరం, జలుబు, దగ్గు అధికంగా ఉన్న వారు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

మార్గదర్శకాలు పాటించాలి

కోవిడ్ మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్ తెలిపారు. భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, చేతులను తరచూ శుభ్రం చేసుకోవడం వంటి కనీస జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

బదిలీలు.. బెదిరింపులు!

- ఆందోళనలో ఉద్యోగులు
- ట్రాన్స్‌ఫర్‌కు దరఖాస్తు చేసుకోవాలని పలువురిపై ఒత్తిడి
- చక్రం తిప్పుతున్న కూటమి నేతలు
- మాట వినే వారికే కీలక పోస్టులు



తిరుపతి అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీల గుబులు పట్టుకుంది. ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కూటమి నేతలు బెదిరిస్తున్నట్లు ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. బదిలీ కోరకుంటే సస్పెండ్ చేయిస్తామని ఎమ్మెల్యేలు హెచ్చరిస్తున్నట్లు పలువురు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదిలేక ప్రధానంగా రెవెన్యూ, అగ్రికల్చర్ విభాగాలకు చెందిన ఉద్యోగులు కొందరు బదిలీకి దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది సెప్టెంబర్‌లో 15 విభాగాల చెందిన వారికి మాత్రమే బదిలీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సారి అన్ని విభాగాల్లోనూ ట్రాన్స్‌ఫర్లు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కీలకమైన అన్ని పోస్టుల్లోను ఒకే సామాజిక వర్గానికి చెందినవారినే కూర్చోబెట్టనున్నట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

మనోడై ఉండాల్సిందే!

మన ప్రాంతానికి వచ్చే రెవెన్యూ అధికారి మనోడై ఉండాల్సిందే అని జిల్లాలోని ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నట్లు సమాచారం. అలాగే చెప్పిన మాట వినే వారికే కీలక పోస్టులు ఇప్పించాలని యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా తిరుపతితోపాటు శ్రీకాళహస్తి, చంద్రగిరి, వెంకటగిరి,సూళ్లూరుపేట, గూడూరులోని ప్రజా ప్రతినిధులు తమ వారిని తెచ్చుకునేందుకు గట్టిగానే పనిచేస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఈ క్రమంలోనే గతంలో తూర్పు మండలాల్లో పనిచేసిన ఇద్దరు తహసీల్దార్లపై అవినీతి ఆరోపణలు తీవ్రంగానే ఉన్నాయి. అయితే కూటమి నేతలకు రూ.కోట్ల ముడుపులు చెల్లించి తిరుపతిలో కీలకమైన రెవెన్యూ పోస్టును సంపాదించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు సదరు అధికారులు సైతం ''అవును తిరుపతికి వచ్చేస్తున్నాం. కేవలం వారం రోజులు ఆగండి...ఆ తర్వాత అంతా కలసి చేసుకుందాం. ఇప్పటికే పెద్ద మొత్తంలో ప్రజా ప్రతినిధులకు ఇచ్చుకోవాల్సి వచ్చింది. దానికి రెండు మూడు రెట్లు సంపాదించుకుందాం'' అంటూ పలువురు సిబ్బందితో వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రస్తుతం జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులు ''ఔను...బదిలీల ప్రచారం వాస్తవమే నేను కూడా వెళ్లిపోతున్నా.. కూటమి నేతలు చెప్పిందల్లా నేను చేయలేను...బదిలీనే మేలని భావిస్తున్నా.. అసలే ప్రమోషన్ జాబితాలో ఉన్నాం.. వాళ్ల అవినీతికి వంతపాడితే ఇరుక్కుంటా'' అని తమ వద్దకు వచ్చే వారితో చెబుతున్నట్లు తెలిసింది.

అదనపు మార్గదర్శకాలు

బదిలీలకు సంబంధించి తాజాగా పంచాయతీరాజ్‌శాఖకు అదనపు మార్గదర్శకాలను శుక్రవారం విడుదల చేశారు. ప్రధానంగా కార్యదర్శులు 50శాతం కంటే తక్కువ పన్నులు వసూలు చేసి ఉంటే వారిని నాన్ ఫోకల్ పంచాయతీలకు (ఆదాయవనరులు తక్కువ ఉండేవి)బదిలీ చేయాలని పేర్కొన్నారు., ఐదేళ్లు సర్వీస్ పూర్తి చేసినవారితోపాటు డిప్యూటీలో సర్వీస్ ఉన్నప్పటికీ ట్రాన్స్‌ఫర్ చేయాలని నిర్ణయించారు. కింది స్థాయి ఉద్యోగులు సొంత మండలం, డివిజన్ స్థాయివారు సొంత డివిజన్‌లోను , జిల్లా స్థాయి ఉద్యోగులు సొంత జిల్లాలోను పనిచేయకూడదని ఉత్తర్వుల్లో వెల్లడించారు. అలాగే విజిలెన్స్ కేసులు, తీవ్రమైన ఆర్థిక ఆరోపణలు ఉన్న పంచాయతీ కార్యదర్శులను అదే గ్రేడ్‌లోని నాన్ ఫోకల్ గ్రామ పంచాయితీకి బదిలీ చేయాలని ఆదేశించారు.

వ్యవసాయశాఖలోనూ అదే పరిస్థితి

ప్రస్తుతం వ్యవసాయశాఖతోపాటు వాటి అనుబంధశాఖల్లో బదిలీలు చేపట్టనున్నారు. ప్రధానంగా బదిలీ చేయడానికి ఐదేళ్ల సర్వీస్ పూర్తయ్యి ఉండాలి. లేదా వారే వెళ్లిపోవాలంటే కనీసం రెండేళ్ల సర్వీస్ ఉంటేనే బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. ఏడాదిలో ఉద్యోగ విరమణ ఉంటే వారికి బదిలీ నుంచి మినహాయింపు ఉంటుంది. ఈ మూడు అంశాలను బదిలీల సమయంలో పాటించాలి. అయితే కూటమి నేతలు తెలివిగా రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని బలవంతంగా బదిలీ పెట్టుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది . లేదంటే సస్పెండ్ చేయిస్తామని హెచ్చరిస్తున్నట్లు చర్చ సాగుతోంది. దీంతో అధికారులు సస్పెండ్ కావడం కన్నా బదిలీపై వెళ్లడమే ఉత్తమంగా భావిస్తున్నారు.

సిఫార్సుల జోరు

కీలకమైన శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ముడుపులు చెల్లించుకుని బదిలీలకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అయితే కింది స్థాయికి చెందిన ఉద్యోగులు మాత్రం కూటమి నేతల నుంచి సిఫార్సు లెటర్లు తెస్తున్నట్లు సమాచారం, చిరుద్యోగుల నుంచి సీనియర్ అసిస్టెంట్ల వరకు ఉమ్మడి జిల్లాల పరిధిలోనే బదిలీలు చేపడుతున్నారు. గెజిటెడ్ స్థాయి నుంచి డివిజన్, జిల్లా స్థాయి అధికారులను జోన్-4 పరిధిలో ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. జోన్-4 పరిధిలో ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాలు వస్తాయి. ఈ క్రమంలో అధికారులు వారికి అనుకూలమైన జిల్లాను ఎంపిక చేసుకుంటున్నారు. మొత్తంగా బదిలీల జాబితాలోని ఉద్యోగులకు జూన్ 2 వరకు టెన్షన్ తప్పేలా లేదు. అర్హతే ప్రామాణికంగా తీసుకుని బదిలీ చేస్తారా.. లేదా కూటమి నేతల లేఖలకే ప్రాధాన్యత ఇస్తారా వేచి చూడాల్సిందే.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.99,100
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,940

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,00,000
రిటైల్ వెండి గ్రాము	రూ.103.00

క్లుప్తంగా

ఫిజికల్ సైన్స్ పరీక్షకు 635 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఫిజికల్ సైన్స్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 3,692 మంది హాజరుకావాల్సి ఉండగా వారిలో 635 మంది గైర్హాజరవ్వడంతో 3,052 మంది పరీక్ష రాసినట్లు డీఈఓ కేవీఎన్.కుమార్ తెలిపారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలో భాగంగా నిర్వహించిన సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్షకు 452 మందికిగాను 57 మంది గైర్హాజరవ్వడంతో 395 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా నిర్వహించిన మ్యాథ్స్, హిస్టరీ పరీక్షలకు 328 మందికి 21 మంది గైర్హాజరైనట్టు పేర్కొన్నారు.

అన్యమతస్తుడిపై కేసు

తిరుమల : టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా స్థానిక కల్యాణ వేదికలో ప్రార్థన చేసిన గుర్తుతెలియని ముస్లిం వ్యక్తిపై తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీరాముడు తెలిపారు. గురువారం తమిళనాడుకు చెందిన ఓ ముస్లిం వ్యక్తి కారును కల్యాణ వేదిక వద్ద పార్కింగ్ చేసుకుని అనంతరం కల్యాణ వేదికలోకి ప్రవేశించి నిబంధనలకు విరుద్ధంగా ప్రార్థన చేశాడు. ఈ తతంగం అంతా వీడియో తీసిన వ్యక్తులు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. తిరుపతి ఎస్పీ వీ.హర్షవర్ధన్ రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నిందితుడిని గుర్తించి కేసు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో తిరుమల టూటౌన్ పోలీసులు నిందితుడిని పై కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక ప్రత్యేక బృందంతో గాలింపు చేపట్టారు.

అతిథి గృహంలో నాగుపాము

తిరుమల : తిరుమలలోని స్థానిక రాజేంద్ర ప్రసాదం అతిథిగృహంలోకి నాగుపాము ప్రవేశించడంతో కలకలం రేగింది. అతిథిగృహంలోకి పాము రావడంతో టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర్‌నాయుడుకి సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఆయన ఐదు అడుగుల నాగుపామును చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం అవ్వాచారి కోనలో పామును విడిచిపెట్టారు.

ఐపీఎల్ తరహాలో సీపీఎల్

- జాతీయ స్థాయిలో ఆడేందుకు పునాది కావాలి
- పోటీలను ప్రారంభించిన కమిషనర్ మౌర్య


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య

తిరుపతి ఎడ్యుకేషన్ : ఐపీఎల్ తరహాలో చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్) నిర్వహించడం అభినందనీయమని తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి ఎస్వీయూ స్టేడియంలో నిర్వహిస్తున్న సీపీఎల్ సీజన్-1 క్రికెట్ పోటీలను కమిషనర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఆడేందుకు సీపీఎల్ పునాది కావాలని కోరారు. ఏపీఎల్, ఐపీఎల్‌లో ఆడేందుకు సీపీఎల్ చక్కని వేదికని, ఆ మేరకు క్రికెటర్లు లక్ష్యం నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. సీడీసీఏ అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్నప్పటికీ తగినంత అవకాశాలు, ప్రోత్సాహం లేకపోవడంతో యువత క్రికెట్‌లో రాణించలేకున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే సీపీఎల్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే అండర్-16 మ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, కాంట్రాక్టర్ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఎడిఫై డైరెక్టర్ ప్రణీత్, మారుతీ హాస్పిటల్ అధినేత డాక్టర్ మారుతీ కృష్ణ, సీడీసీఏ కార్యదర్శి రవి, కోశాధికారి గిరి ప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీధర్ కుమార్, శ్రీనివాసమూర్తి, మురళీ యాదవ్, జాయింట్ సెక్రటరీ సతీష్ యాదవ్ పాల్గొన్నారు.

ఆదిత్య, పాయ్ వైస్రాయ్ జట్లు విజయం

సీపీఎల్ సీజన్-1 క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. తొలిరోజు ఆదిత్య, పాయ్ వైస్రాయ్ జట్లు విజయం సాధించాయి. ముందుగా ఆదిత్య జట్టు, హైపీరియన్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. రంజీ ప్లేయర్ అభిషేక్ రెడ్డి 50 బంతుల్లో 80 పరుగులతో రాణించాడు. బౌలింగ్‌లో డానియల్ దాస్ 3 వికెట్లు సాధించాడు. అనంతరం 174 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైపీరియన్ జట్టు 16.4ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ కావడంతో ఆదిత్య జట్టు 41పరుగుల తేడాతో గెలుపొందింది. ఆదిత్య జట్టు బౌలర్ అనిల్‌కుమార్ 3 వికెట్లు సాధించాడు. 80 పరుగులు చేసిన అభిషేక్‌రెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు. మధ్యాహ్నం పాయ్ వైస్రాయ్, రాయల్ చాలెంజ్ తిరుచానూరు జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన పాయ్ వైస్రాయ్ జట్టు నిర్ణీత 18 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 156 పరుగులు చేసింది. వాహీద్ బాషా 20 బంతుల్లో 40 పరుగులు, ధరణికుమార్ 22 బంతుల్లో 40 పరుగులతో రాణించాడు. బౌలింగ్‌లో ప్రవీణ్‌రాజ్, దీపక్ సాయి చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ చాలెంజ్ తిరుచానూరు జట్టు 18 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 116 పరుగులు మాత్రమే చేసింది. దీంతో పాయ్ వైస్రాయ్ జట్టు 40పరుగుల తేడాతో విజయం సాధించింది. బౌలింగ్‌లో రెండు వికెట్లు తీసిన సూర్య మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కింద పాయ్ వైస్రాయ్ హోటల్ మదన్‌మోహన్ రూ.2,500 నగదు బహుమతి అందించారు.

నేడు తలపడే జట్లు

సీపీఎల్ సీజన్-1 పోటీల్లో భాగంగా శనివారం ఉదయం ఆదిత్య లెవెన్స్, రాయల్ చాలెంజ్ తిరుచానూరు జట్లు తలపడనున్నాయి.అలాగే మధ్యాహ్నం హైపీరియన్, స్పార్టన్ వారియర్స్ జట్లు బరిలో దిగనున్నాయి.

రాజీనామా చేసి పోటీ పడదాం

- మరోసారి గెలిచి చూపిస్తాం
- ఎమ్మెల్యే నానికి తిరుపతి రూరల్ ఎంపీపీ, వైస్ ఎంపీపీల సవాల్



మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు యశోద, మాధవరెడ్డి

తిరుపతి రూరల్ : "అయ్యా.. నానీగారు మా పదవులకు మేం రాజీనామా చేస్తాం.. మీరు కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి.. నిజాయితీపరులైన మా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుల మద్దతుతో మేం ఎంపీపీగా, వైస్ ఎంపీపీలుగా గెలిచాం.. మీ దయతో కాదు.. మీరు గేట్లు తెరవండి.. మరోసారి మేమే గెలిచి చూపిస్తాం.. రాజీనామా తర్వాత ఎన్నికలకు పోదాం.. మీరు అన్నట్టు మీ పార్టీ వారు గెలిస్తే కీలకమైన మూడు పదవులు మీకు వస్తాయి.. మేమే గెలిచామా..? మీరు మీ ఎమ్మెల్యే పదవిని వదిలేయాలి.. మా సవాల్‌ను మీరు స్వీకరిస్తే తిరుపతి ప్రెస్‌క్లబ్ వేదికగా అందరం రాజీనామాలు చేద్దాం" అంటూ తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీలు వేముల యశోద, విడుదల మాధవరెడ్డి సవాల్ విసిరారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఆగ్రహం

టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం మాట్లాడుతూ తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నికల్లో మేం గేట్లు తెరచుంటే వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులందరూ మా దగ్గరకు వచ్చేవారని వ్యాఖ్యానించడంపై ఎంపీపీ, వైస్ ఎంపీపీలు మండిపడ్డారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ తాము నిజాయతీగా తమ పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యుల మద్దతుతో విజయం సాధించామన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుంటే, ఎమ్మెల్యే పులివర్తి నాని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పల్లెల్లో అభివృద్ధి పనులకు పది రూపాయలు కూడా ఇవ్వలేదని, అయితే ఎమ్మెల్యే నాని మాత్రం చెవిరెడ్డి చేసిన అభివృద్ధి కనిపించకుండా రంగులు పూసి హంగామా చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి తీసుకువచ్చిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులనే ఇప్పుడు నాని ప్రారంభిస్తున్నారని వెల్లడించారు. మండల పరిషత్ కమిటీ దయతో జరిగే అభివృద్ధిని అడ్డం పెట్టుకుని ఎమ్మెల్యేగా గ్రామాల్లోకి వెళుతున్నారని స్పష్టం చేశారు. మ సవాల్‌ను ఎమ్మెల్యే నాని స్వీకరించి రాజీనామాకు ముందుకు వస్తే తిరుపతి ప్రెస్‌క్లబ్ వేదికగా తమ పదవులు వదులుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిన్నియాదవ్, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు పాల్గొన్నారు.

నడి రోడ్డుపై మందుబాబు హల్‌చల్

– సిట్టింగ్ రూములు లేవని నిరసన


నడి రోడ్డుపైనే మద్యం తాగుతున్న మందుబాబు

శ్రీకాళహస్తి: మందు తాగడానికి సరైన సిట్టింగ్ రూములు లేవంటూ ఓ మందుబాబు నడిరోడ్డుపై మద్యం సేవిస్తూ హల్‌చల్ చేసిన ఘటన శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం షాపుల యజమానులు కుమ్మక్కై, పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసి, తినుబండారాలు, ఇతర వస్తువుల రేట్లు ఇబ్బడిముబ్బడిగా పెంచేశారని, వీటన్నింటినీ కట్టడి చేయకుంటే మళ్లీ ఫుల్ బాటిల్‌తో స్థానికంగానే తాగుతూ నిరసన వ్యక్తం చేస్తానని సదరు మందుబాబు చెప్పడం గమనార్హం. ఇంత జరుగుతున్నా సంబంధిత పోలీసు అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. అటువైపు వెళ్లే ప్రయాణికులు బౌరా..? అంటూ ముక్కున వేలేసుకోవడం కనిపించింది. దీనిపై రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డిని వివరణ కోరగా అతనిపై కేసు నమోదు చేశామని, మత్తులో ఉండడం వల్ల అతనిపై పబ్లిక్ న్యూసెన్స్, ఓపెన్ బూజింగ్ కేసులు నమోదు చేశామన్నారు. మత్తు దిగిన తరువాత కౌన్సెలింగ్ ఇచ్చి కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

లోకేష్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్ చేయాలని తీర్మానం



మినీ మహానాడు వేదికపై టీడీపీ నేతలు

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించాలని తిరుపతిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మినీ మహానాడులో తీర్మానం చేశారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ అధ్యక్షతన తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో మినీ మహానాడు నిర్వహించారు. ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సునీల్ కుమార్, రామకృష్ణ, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ తమ నియోజవర్గాల్లో చేసిన తీర్మానాల అంశాలను వివరించారు. తీర్మానాల అంశాలను వేదిక దృష్టికి తెచ్చారు. టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య, శాప్ చైర్మన్ రవినాయుడు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నాగేంద్ర మృతదేహం

తిరుపతి క్రైమ్ : తిరుపతిలోని గరుడ వారధిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. చంద్రగిరి మండలం రంగంపేటకు చెందిన నాగేంద్ర(30) బైక్‌పై తిరుచానూరు నుంచి తిరుపతికి గరుడ వారధిపై వెళుతూ అదుపుతప్పి రైలింగ్ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నాగేంద్ర అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ఇద్దరికి గాయాలు


గాయపడిన అంబిక

తిరుపతి రూరల్ : పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లె చెక్ పోస్టు సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట నుంచి తిరుపతికి టమాటాలు తీసుకుని వస్తున్న లగేజీ ఆటోను వెనుక నుంచి వచ్చిన టయోటా వాహనం ఢీకొంది. దీంతో టమాటా వాహనం రహదారి పక్కన గోతిలో పడింది. డ్రైవర్ రాజు, వెనుక కూర్చున్న కూలీ అంబికకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ప్రమాదానికి కారణమైన టయోటా వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంబిక తల్లి వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేరకు తిరుపతి రూరల్ ఎస్ఐ షేక్షావలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన అంబిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

కాపునాడు ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షులుగా రాధ



తిరుపతి కల్చరల్ : కాపునాడు సేవా సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షులుగా దామా రాధా నియమితులయ్యారు. శుక్రవారం ఈమేరకు సమితి జిల్లా అధ్యక్షుడు మధురాయల్ ఆధ్వర్యంలో పసుపులేటి హరిప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. హరిప్రసాద్ మట్లాడుతూ 200 మంది మహిళలతో కాపునాడు సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాపునాడు జిల్లా అధికార ప్రతినిధి తుపాకుల మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ జ్ఞాన చంద్ర, పగడాల సునీల్ రాయల్ పాల్గొన్నారు.

కోదండరామునికి 'కియోస్క్' బహూకరణ


ఆలయ అధికారులకు కియోస్క్ మిషన్ అందజేస్తున్న సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామి ఆలయానికి శుక్రవారం కియోస్క్ యంత్రాన్ని సౌత్ ఇండియన్ బ్యాంక్ విరాళంగా అందించింది. ఈ క్యూ ఆర్ కోడ్ యంత్రంతో యూపీఐ మోడ్‌లో రూ.లక్ష వరకు భక్తులు విరాళంగా అందజేయవచ్చు. ఇప్పటికే సౌత్ ఇండియా బ్యాంక్ ప్రతినిధులు ఒక కియోస్క్ మిషన్ అందించారు. కియోస్క్ మిషన్లను తిరుమల అన్నదానం, పద్మావతి గెస్ట్ హౌస్, సీఆర్‌ఓ ఆఫీస్, దేవుని కడప, శ్రీగోవిందరాజస్వామి ఆలయం, అమరావతి, ఒంటి మిట్ట, పద్మావతీదేవి ఆలయం, వకుళామాత ఆలయం, కపిలతీర్థం ఆలయం, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విజయవాడలో టీటీడీ వినియోగిస్తోంది. బ్యాంక్ ప్రతినిధులు ఏవీ నిరంజన్, ఆర్.వెంకటరావు, డి.అశోక్ వర్ధన్, ఆలయ డిప్యూటీ ఈఓ బి.నాగరత్న, ఐటీ డీజీఎం బి.వెంకటేశ్వర్లు ,ఏఈఓ బి.రవి, సూపరింటెండెంట్ డి.మునిశంకర్ పాల్గొన్నారు.

వైన్‌షాపులపై నిరంతరం నిఘా

తిరుపతి క్రైమ్ : జిల్లాలోని వైన్‌షాపులపై నిరంతరం నిఘా ఉంటుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 11 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 250 మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు అధికారులు, సిబ్బంది బృందాలు ఏర్పడి కేటాయించిన ప్రాంతాల్లోని వైన్‌షాపులపై నిఘా పెడతారని వెల్లడించారు. దుకాణాలు తెరిచే సమయం, మూసే వేళలను గమనిస్తారని చెప్పారు. అలాగే వైన్‌షాపుల పక్కన అనధికా పర్మిట్‌రూమ్‌లను అరికట్టేందుకు కేసులు సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం దుకాణాల యజమానులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

నమ్మకానికి, దృఢత్వానికి ప్రతీకగా భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్


బీమా పత్రాలను అందిస్తున్న భారతి సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు

తిరుపతి రూరల్ : వినియోగదారుల నమ్మకానికి, గోడల దృఢత్వానికి ప్రతీకగా భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంటు నిలుస్తుందని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ సి.ఛాయాపతి తెలిపారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లెలోని శ్రీసాయితేజ స్టీల్ అండ్ సిమెంట్ అధినేత కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాయాపతి మాట్లాడుతూ జర్మన్ టెక్నాలజీ, రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ నిపుణుల పర్యవేక్షణలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంటును ఉత్పత్తి చేస్తున్నట్టు వెల్లడించారు. ట్యాంపర్ ప్రూఫ్ బస్తాలతో మార్కెట్‌లోకి వస్తుండడంతో తూకం తగ్గే అవకాశం కూడా ఉండదన్నారు. సిమెంట్ రంగంలో భారతి సిమెంటు అగ్రగామిగా నిలిచిందని చెప్పారు. అనంతరం భారతి సిమెంట్‌కు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలు, విశిష్టత తదితర అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంటు తయారవుతున్న విధానం, భవన నిర్మాణ కార్మికులు పాటించాల్సిన జాగ్రత్తలను క్షుణ్ణంగా వివరించారు. వినియోగదారుల సౌలభ్యం కోసం భారతి సిమెంట్ ప్రతిచోటా అందుబాటులో ఉండేలా డీలర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా పత్రాలను అందించారు.

యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి అర్బన్ : యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, యూపీఎస్సీ అబ్జర్వర్ హన్సవదన, సంయుక్త కార్యదర్శి ఎన్‌జీ అజ్మీరతో కలసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం నిర్వహించనున్న పరీక్షలకు జిల్లాలో 13 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 12 ప్రభుత్వ కళాశాలలు, ఒక ప్రైవేటు కళాశాలను సెంటర్‌గా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. మొత్తం 5261 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. యూపీఎస్సీ ఎగ్జామినేషన్‌ను ఉదయం 9.30 గంటల నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్లుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైన కేంద్రంలోకి అనుమతించమని స్పష్టం చేశారు. ఎగ్జామ్ సెంటర్ల వద్ద ఇంటర్నెట్, జిరాక్స్ షాపులను మూసివేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, పరికరాలను తీసుకెళ్లకూడదని కోరారు. అభ్యర్థుల రాకపోకలకు ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే పరీక్షలకు సంబంధించి భద్రతా అంశాలపై పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ నరసింహులు, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ చరణ్ తేజ్, డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, డ్వామా పీడీ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, విద్యుత్‌శాఖ అధికారి సురేంద్ర నాయుడు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారిరి లక్ష్మి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వెంకట్రావ్ పాల్గొన్నారు.

టీడీపీ విస్మరిస్తోంది

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ గెలుపునకు అహర్నిశలు శ్రమించిన నాయకులను పార్టీ అధిష్టానం విస్మరిస్తోందని పిచ్చాటూరు ఏఎంసీ చైర్మన్ ఇలంగోవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం తామంతా సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం వెంట ఉన్నామన్న కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నారా? అని పార్టీ అధిష్టానాన్ని ఎమ్మెల్యే వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం పిచ్చాటూరు మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే వర్గీయులు మాట్లాడారు. అసలు అనధికారిక హోదాల్లో పరిశీలకులుగా చంద్రశేఖర్ నాయుడు, కో-ఆర్డినేటర్‌గా శ్రీపతిబాబులు పెత్తనం చెలాయించడమేమిటని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని సంపద, ఇతర అక్రమ వ్యాపారాలు చేసేందుకు ఒక వర్గానికి చెందిన వారి కనుసన్నల్లో పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం, తద్వారా పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. వారి కుట్రలతోనే సిట్టింగ్ ఎమ్మెల్యేని వివాదాల్లోకి నెట్టి వీరు పెత్తనం చెలాయించేందుకు కుట్రలు పన్నారని తెలిపారు. కోర్టులో సైతం ఆయనపై ఆరోపణలను కొట్టి వేసినప్పటికీ సస్పెన్షన్ ఎత్తివేయడంలో పార్టీ అధిష్టానం ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ఇదంతా అనధికారిక హోదాలో పెత్తనం చెలాయిస్తున్న వారి కుట్రలో భాగమేనని వారు వివరించారు. నియోజకవర్గ పర్యటనకు వచ్చిన మంత్రి లోకేష్ బాబు ఈ విషయాన్ని ఎందుకు తేలల్చలేదని ప్రశ్నించారు. టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదిమూలం లేకనే మినీ మహానాడు నిర్వహించడమేంటని ప్రశ్నించారు. అలాగే సార్వత్రిక ఎన్నికల సమయంలో స్వతంత్ర్య అభ్యర్థి చెరుకు గుర్తుపై పోటీ చేసిన యాతాటి రమేష్‌తో కుమ్మక్కైన సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత, ఆమె అనుచరులు ఏడు మండలాల్లో మండలానికి రూ.2కోట్ల చొప్పున స్వాతంత్ర్య అభ్యర్థి వద్ద నగదు తీసుకుని ఆయనకు అమ్ముడుపోయి తెలుగుదేశం ఓటమికి కుటిల రాజకీయాలు చేసిన ఆమె పార్టీ కార్యక్రమాల్లో ఎలా హాజరవుతుందని ప్రశ్నించారు. ఆ వివరాలను త్వరలో బహిర్గతం చేస్తామని చెప్పారు. సమావేశంలో టీడీపీ నాయకులు సెల్వం, గోవిందస్వామి, మురళి, మల్లికార్జునరెడ్డి, భక్తవత్సలం, ఎస్ఎం సురేష్, బాలాజీ, కన్నయ్య నాయుడు, పద్దురాజు పాల్గొన్నారు.

ఎస్వీయూలో వసతులు లేక వెతలు!


ఎస్వీయూ పరిపాలన భవనం

తిరుపతి సిటీ : ఎస్వీయూలో మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నామని వర్సిటీ ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. దీనిపపై వర్సిటీ అధికారులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు. ఈ క్రమంలో శనివారం మరోసారి వర్సిటీ ఇంజినీర్‌ను మౌలిక వసతుల కల్పనపై నిలదీయనున్నట్లు సమాచారం. పరిపాలన భవనంలో సదుపాయాలపై వీసీ, రిజిస్ట్రార్‌తో చర్చించినా అడుగు ముందుకు పడటం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాసిరకం ఫర్నిచర్‌తో ఇక్కట్లు

పరిపాలన భవనంలోని ప్రధాన సెక్షన్లలో బెంచీలు, కుర్చీలు,, బీరువాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, ఎగ్జామినేషన్ సెక్షన్‌లో పరిస్థితి దారుణంగా తయారైందని ఉద్యోగులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం ఎగ్జామినేషన్ విభాగంలో నూతన ఫర్నిచర్‌ను అమర్చేందుకు తీసుకువచ్చిన సామగ్రి పూర్తిగా నాసిరకంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ కంపెనీ పేరుతో వర్సిటీకి తెచ్చిన ఫర్నిచర్‌పై రెండు ఫైళ్లు పెట్టగానే వంగిపోతున్నాయని ఆరోపిస్తున్నారు.

తాగునీరు కూడా లేదు

ఎస్వీయూ పరిపాలన భవనంలో తాగునీరు కూడా అందుబాటులో లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఆర్‌ఓ ప్లాంట్ వద్ద అపరిశుభ్రంగా ఉంటోందని వెల్లడిస్తున్నారు. దీంతో ఇంటి నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని తెలియజేస్తున్నారు. వర్సిటీలో టాయిలెట్స్ పరిస్థితి మరీ దారుణంగా ఉందని వివరిస్తున్నారు.

నిలదీయనున్న ఉద్యోగులు

పరిపాలనా భవనంలో నాసిరకం ఫర్నిచర్, టాయిలెట్స్, తాగునీటి సౌకర్యంపై వర్సిటీ ఇంజినీర్‌ను నిలదీయాలని ఉద్యోగులు నిర్ణయించినట్లు తెలిసింది. సమస్యల పరిష్కారంపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరనున్నట్లు సమాచారం.

ప్రభుత్వ తీరుపై ఆర్టీసీ ఉద్యోగుల ఆవేదన


నూతన కమిటీతో ఎంప్లాయీస్ యూనియన్ నేతలు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మంగళం డిపోకు చెందిన ఈయూ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఆర్‌సీ, అరియర్స్, డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 10వేలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని...అయినా వాటిని భర్తీ చేయడం లేదన్నారు. దీంతో ఉద్యోగులపై అదనపు భారం పడుతోందని వెల్లడించారు. అద్దె బస్సులను తీసుకోవడంతోనే కాలయాపన చేస్తున్నారని, కొత్త బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో ఈయూ నేతలు రెడ్డెప్ప, వీఆర్ కుమార్, అర్జున్, సతీష్‌నాయుడు, మురగమ్మ, మస్తాన్, సత్యనారాయణ, గురున్నాథం, సుబ్రమణ్యం, రఘు, మధు, శేషాద్రి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

మంగళం డిపో ఈయూ కొత్త కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బి.శేషాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేఎస్ వాసు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎంఎస్ రెడ్డి, ఎం.మోహన్ నాయుడు, డిపో సెక్రటరీ టీవీ బాబు, జాయింట్ సెక్రటరీ చిరంజీవి, ప్రచార కార్యదర్శి బి.బాలాజీ, ట్రెజర్ విశ్వనాథ్, అసిస్టెంట్ సెక్రటరీగా రేఖా మరో ముగ్గురు ఉపాధ్యక్షులు, ముగ్గురు ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ముగ్గురు అసిస్టెంట్ సెక్రటరీలతో కమిటీని ఎంపిక చేశారు.